


నిధులు జమకాకుంటే.. ప్రతిపక్షంపైకి నెట్టేసేలా

వైఎస్సార్ చేయూత, ఈబీసీ నేస్తం కార్యక్రమాలను పండగ మాదిరి ప్రతి మండలాల్లోనూ.. నియోజకవర్గాల కేంద్రాల్లోనూ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో నిర్వహించి డమ్మీ చెక్కులను అందజేశారు. ప్రభుత్వాన్ని పొగుడుతూ ప్రచారం చేపట్టారు. ప్రస్తుతం డమ్మీ చెక్కులు సభల్లో పంపిణీ చేసినా... మరో రెండుమూడు రోజుల వ్యవధిలో డబ్బులు జమవుతాయని ఇన్నాళ్లూ మహిళలు మౌనం దాల్చారు. కానీ నెలరోజులు దాటినా సీఎం జగన్, వైసీపీ నాయకులు ఆ సంక్షేమ పథకాల డబ్బుల కోసం ప్రస్తావించకుండా ప్రతిపక్షాలపై విమర్శలకు పరిమితం అవుతున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. ఇలా అయితే రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పడం ఖాయమని స్పష్టం చేస్తున్నారు.

ఉత్తుత్తి.. బటన్ నొక్కుడు





(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సంక్షేమ పథకాలపై గొప్పగా ప్రచారం చేసుకున్నారు. బటన్ల మీద బటన్లు నొక్కారు. ఖాతాలో డబ్బులు వేశామంటూ ఆర్భాటాలు పోయారు. కానీ నిధులు జమ చేయడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. భారీ సభలు ఏర్పాటు చేసి సీఎం జగన్ ఆర్భాటంగా బటన్ నొక్కడం తప్ప.. బ్యాంకు ఖాతాలో మాత్రం డబ్బులు వేయడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. మే 13న సార్వత్రిక ఎన్నికలు జరుగనున్నాయి. గత నెల 16న ఎన్నికల షెడ్యూల్ విడులైంది. కోడ్ నేపథ్యంలో ఎన్నికల షెడ్యూల్‌కు ముందే సీఎం జగన్ 'వైఎస్సార్ చేయూత', 'వైఎస్సార్ ఈబీసీ'తో పాటు పలు సంక్షేమ పథకాలకు బటన్ నొక్కారు. కానీ ఇంతవరకూ కొన్ని పథకాలకు సంబంధించిన డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో జమకాలేదు. నెలల తరబడి లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎక్కడ చూసినా రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వైసీపీ పాలనలో విద్యుత్ చార్జీలు, పెట్రోలు, గ్యాస్‌తో పాటు నిత్యావసరాల ధరలు భారీగా పెరిగిపోయాయి. మద్యపాన నిషేధం హామీ అటకెక్కింది. అయినప్పటికీ ఏదో ఒక పథకం ద్వారా తమకు కొంతమేర లబ్ధి కలుగుతుందనే ఉద్దేశంతో ఇన్నాళ్లు ప్రజలు బహిరంగంగా అసంతృప్తి వెళ్లగక్కలేదు. కాగా.. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండడంతో వైసీపీ లోపాలను ఎక్కడికక్కడ ఎండగడుతున్నారు. సంక్షేమ పథకాలకు బటన్ నొక్కడమే తప్ప.. నిధులు మంజూరు చేయడం లేదని ఆరోపిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో వైపీపీకి గుణపాఠం చేప్పేందుకు సిద్ధమవుతున్నారు.

● చేయూత నిధుల కోసం ఎదురుచూపు..

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం వైఎస్సార్ చేయూత పథకాన్ని ప్రవేశపెట్టింది. 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఏడాదికి ఒక్కొక్కరికి రూ.18,750 చొప్పున మూడు దఫాలు పంపిణీ చేసింది. ఈ ఏడాది మార్చి 7న అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పిసిని కాడలో భారీ బహిరంగ సభ నిర్వహించి 'వైఎస్సార్ చేయూత' పథకానికి సీఎం జగన్ బటన్ నొక్కారు. రానున్న 14 రోజుల పాటు 'చేయూత' నిధుల జమ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపా రు. ఇప్పటికి నెలరరోజులు పూర్తయింది. కానీ ఇంత వరకూ మ హిళల ఖాతాలో నగదు కాలేదు. జిల్లాకు సంబంధించి 1,77,314 మంది మహిళలకు గాను రూ.332.46 కోట్లను అందించాల్సి ఉం ది. ఆయా మహిళలంతా చేయూత డబ్బుల కోసం ఎదురుచూ స్తున్నారు. శ్రీకాకుళంలోని బాపూజీకళామందిర్‌లో డీఆర్డీఏ ఆధ్వ ర్యంలో వైసీపీ నాయకులు, అధికారులు 'చేయూత' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మూడు నాలుగు రోజుల ముందే మహిళల నుంచి వేలిముద్రలను బయోమెట్రిక్ డివైజ్ ద్వారా వలంటీర్లు తీసుకున్నారు. ఇప్పటికీ నిధులు జమ కాకపోవ డంతో మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉత్తుత్తి బటన్ నొక్కేశారని, డబ్బులు మాత్రం జమ చేయడం లేదని ఆరోపిస్తున్నారు.

● 'ఈబీసీ నేస్తం'.. అంతే..

అగ్రవర్ణ పేద మహిళల కోసం ప్రవేశపెట్టిన 'వైఎస్సార్ ఈబీసీ నేస్తం' పథకం కూడా అంతే. ఈ పథకం కింద రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య బ్రాహ్మణ, క్షత్రియ, వెలమతో పాటు ఇతర ఓసీ సామాజిక వర్గాలకు చెంది 45 నుంచి 60 ఏళ్లలోపు ఉన్న అర్హులైన మహిళలకు ఏటా రూ.15వేలు చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. ఈ ఏడాది మార్చి 14న నంద్యాల జిల్లా బనగానపల్లెలో 'వైఎస్సార్ ఈబీసీ నేస్తం' కార్యక్రమానికి గాను సీఎం బటన్ నొక్కారు. ఇప్పటికి 24 రోజులవుతోంది కానీ డబ్బులు జమ చేయలేదు. జిల్లాకు సంబంధించి 2,529 మంది అగ్రవర్ణపేద మహిళా లబ్ధిదారులకు రూ.3.53 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంది. ఇందుకు కూడా వలంటీర్లు ముందుగానే వేలిముద్రలు సేకరించారు. కలెక్టరేట్‌లో అధికార పార్టీనేతలు, అధికారులు.. కొంతమంది మహిళల సమక్షంలో లైవ్ కార్యక్రమాన్ని నిర్వహించి డమ్మీ చెక్కును కూడా అందజేసేశారు. ఇప్పటికీ నిధులు జమకాకపోవడంతో ప్రభుత్వతీరుపై లబ్ధిదారులు మండిపడుతున్నారు.

● డబ్బులు జమవుతాయో.. లేదో..



మొన్నటివరకు ఇదిగో అదిగో చేయూత డబ్బులు ఇస్తామని చెప్పారు. నాతోపాటు మా మహిళా సంఘంలో కొంతమంది సభ్యులు చేయూత పథకం ద్వారా డబ్బులు వస్తాయని.. కుటుంబ అవసరాలు తీరుతాయని ఎదురుచూశాం. కానీ నెలరోజులైనా నిధులు జమకాలేదు. డబ్బు లు జమవుతాయో లేదో అధికారులు కూడా ఏమీ చెప్పడం లేదు.

-గోకర్ల భాగ్యం, పాలవలస, సోంపేట మండలం

● ఆర్థిక సాయం ఏదీ



చేయూత పథకం కింద ఆర్థిక సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. బటన్ నొక్కారు కానీ.. ఆర్థిక సాయం అందించలేదు. అక్కచెల్లెమ్మలంటూ.. చివరి విడత డబ్బులు జమ చేయకపోవడం కరెక్ట్ కాదు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

-పేడాడ మణికుమారి, బొప్పడం, సరుబుజ్జిలి



వాకలవలసలో ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు

ఆ ఉసురు ప్రభుత్వానిదే

- శ్రీకాకుళం-ఆమదాలవలస గుంతల రోడ్డులో నిత్యం ప్రమాదాలే
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని పాలకులు
- వాకలవలస రోడ్డుపై బాధిత కుటుంబసభ్యులు, నాలుగు గ్రామస్థుల నిరసన

శ్రీకాకుళం రూరల్/ గుజరాతీపేట, ఏప్రిల్ 7: 'శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డులో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. నెలకు ఇద్దరు ముగ్గురు చొప్పున ప్రాణాలు కోల్పోతున్నారు. ఎంతోమంది దివ్యాంగులుగా మారుతున్నారు. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఆ ఉసురు ప్రభుత్వానిదే'నంటూ బాధిత కుటుంబ సభ్యులు, ఈ ప్రాంతంలోని నాలుగు గ్రామాల ప్రజలు ఆందోళన చేశారు. వైసీపీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ.. ఆదివారం వాకలవలస రోడ్డుపై బైఠాయించారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 4న రాత్రి 11.30గంటల సమయంలో సీఆర్‌ఎస్‌ఎఫ్ జవాను బొడ్డేపల్లి గన్నయ్య ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వాకలవలస జంక్షన్ వద్ద లారీ ఢీకొని అక్కడికక్కడే చనిపోయాడు. బాధిత కుటుంబ సభ్యులు ఆదేరోజు రాత్రి జవాను మరణానికి వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమంటూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు నచ్చజెప్పారు. కాగా.. ఆ రోడ్డులో మరో ప్రాణం బలికాకూడదనే ఉద్దేశంతో ఆదివారం వాకలవలస, వంజంగి, రాగోలు, ఆర్టీసీ కాలనీ నాలుగు గ్రామాలతో పాటు జవాను కుటుంబ సభ్యులు, యువత పెద్దఎత్తున వాకలవలస సమీపంలో ఆందోళన చేశారు. మాకొద్దీ ఈ రోడ్డు.. జగన్ రెడ్డి ఇంకెంత మంది ప్రాణాలు తీసుకుంటారు.. ఈ ఉసురు ప్రభుత్వానిదే అంటూ నినాదాలు చేసి బైఠాయించారు. ఈ రోడ్డులో ఇంకా ఎన్ని ప్రాణాలు పోతే ప్రభుత్వం, పాలకులు స్పందిస్తారంటూ నిలదీశారు. 'ఐదేళ్లలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, స్పీకర్ తమ్మినేని సీతారామ్ ఈ రోడ్డు నిర్మాణానికి పూనుకోకపోవడం దారుణం. ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకోకపోవడం శోచనీయం. వైసీపీ పాలనలో ఒక్క గుంత కూడా పూడ్చకపోవడం అన్యా యం. రోడ్డు ప్రమాదాల బారి నుంచి మా కుటుంబాలను మేమే కాపాడుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు బాగుచేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన నేపథ్యంలో సుమారు రెండు గంటలపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. శ్రీకాకుళం సీఐ ఎల్.సన్యాసినాయుడు, రూరల్ ఎస్ఐ వాసు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలని కోరడంతో ఆందోళన విరమించారు.

ప్రభుత్వం పట్టించుకోలేదు

శ్రీకాకుళం, ఆమదావలస రోడ్డు మరమ్మతుల విషయంపై వైసీపీ ప్రభుత్వానికి విన్నవించాం. కలెక్టర్‌కు సైతం స్పందనలో అర్జీ పెట్టాం. ఐదేళ్లలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టలేదు. గుంతలు పూడ్చలేదు. దీంతో భారీ వాహనాలు ఈ రోడ్డు గుండా వెళ్లడంతో ఎన్నో ప్రాణాలు పోతున్నాయి. ఇప్పటికైనా తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలి.

- పైడి విశ్వేశ్వరరావు, మాజీ సర్పంచ్, వంజంగి

కనీస మరమ్మతులు లేవు

రోజుకు వేలాదిమంది ప్రజలు ఆమదావలస, శ్రీకాకుళం రోడ్డుపై ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇది ప్రభుత్వానికి పట్టదా?. ఈ రోడ్డులో ఐదేళ్లలో సుమారు 68మంది ప్రాణాలు కోల్పోయారు. అధికారపార్టీ నేతలు సిగ్గులేకుండా తిరుగుతున్నారు. కనీసం రోడ్డు మరమ్మతులకు నోచుకోకపోవడం సిగ్గుచేటు.

- సనపల సురేష్ కుమార్

పాలకుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

- అధ్వానంగా వంశధార కాలువ
- పేరుకుపోయిన పూడికలు
- సాగునీటికి తప్పని ఇబ్బందులు
- దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితం
- కానరాని ఆధునికీకరణ



టెక్కలి సమీపంలో గుర్రపుడెక్కలతో నిండిన వంశధార ప్రధాన ఎడమకాలువ దుస్థితి ఇది. వాస్తవానికి ఈ కాలువ ద్వారా 2,480 క్యూసెక్కుల నీరు వెళ్లాల్సి ఉంది. కానీ కాలువల్లో పూడికలు, గుర్రపుడెక్క, రాళ్లు, నాచు, ఇతర పిచ్చిమొక్కలు పేరుకుపోయాయి. దీంతో టెక్కలి ప్రాంతం వచ్చేసరికి ఈ కాలువద్వారా కనీసం 600 క్యూసెక్కుల కూడా రాని దుస్థితి నెలకొంది.

(టెక్కలి)

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు ఏటా సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. ఐదేళ్లలో ప్రాజెక్టుల ఊసు లేదు. కనీసం కాలువల మరమ్మతులు కూడా చేపట్టలేదు. దీంతో ఎక్కడికక్కడ పూడికలు పేరుకుపోయి.. సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంశధార ప్రధాన ఎడమకాలువ 104.826 కిలో మీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ కాలువ ద్వారా సుమారు లక్షా48వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా.. దీని సామర్థ్యం తగ్గి నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. వైసీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో వంశధార ప్రధాన ఎడమకాలువలో తట్టెడు మట్టి తొలగించడం కానీ, షట్టర్లు మరమ్మత్తులు కానీ చేపట్టలేదు. దీంతో శివారు ప్రాంతాలకు సాగునీరు అందని దుస్థితి నెలకొంది. దశాబ్దకాలంగా వంశధార ప్రధాన ఎడవకాలువ ఆధునికీకరణ పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. కాలువలో అనేకచోట్ల శిథిలమైన షట్టర్లు, డ్రాప్‌లు మూలంగా కొంత సాగునీరు లీకేజీలకు కారణమవుతోంది. వంశధార అధికారులు రూ.970కోట్లతో ప్రతిపాదనలు చేశారు. కాగా ఈఎన్‌సీ కార్యాలయం వద్ద సాంకేతికంగా కొర్రీలు పడడంతో కాలువల ఆధునికీకర ణ అటుకెక్కింది. సంతబొమ్మాళి, టెక్కలి, నందిగాం, పలాస, వజ్రపుకొత్తూ రు మండలాలకు సంబంధించి శివారు ప్రాంతాల్లో ఖరీఫ్ సీజన్‌లో ఏటా సాగునీటి సమస్య ఉత్పన్నమవుతోంది. వంశధార అధికారులు కాలువల్లో అక్కడక్కడా ఏ, బీ కేటగిరిల కింద కొన్ని పనులు చేస్తున్నా.. అవి నామ మాత్రంగా సాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. శివారు ప్రాంతా లకు సాగునీరు అందకపోవడంతో రైతులు ఏటా వంశధార కార్యాలయాల ను ముట్టడిస్తూనే ఉన్నారు. ఇటీవల నందిగాం మండలానికి చెందిన అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సైతం శివారు ప్రాంతానికి సాగునీరు రావడం లేదని వంశధార ఈఈ కార్యాలయాన్ని ముట్టడించి దాడికి యత్నించారు. ఈ వ్యవహారం అప్పట్లో పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో అధికారపార్టీ పెద్దలు రంగంలోకి దిగారు. ఈ వ్యవహారం పెద్దది కాకుండా నీరుగార్చారు. సాగునీటి సమస్యను మాత్రం పరిష్కరించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువ ఆధునికీకరణ చేపట్టాలని, పూడికలు తొలగించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై వంశధార ఈఈ కె.శ్రీకాంత్ వద్ద ప్రస్తావించగా.. వంశధార ప్రధాన ఎడమకాలువ ఆధునికీకరణ కోసం రూ.970కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. ఫైనాన్స్ ఆమోదం పొందాల్సి ఉందని తెలిపారు.



నరసన్నపేటలోని దేశవానిపేట వద్ద 11ఆర్ కిల్లాం కాలువలో తివాచీ పరిచినట్టు అల్లుకున్న గుర్రపుడెక్క ఇది. ఐదేళ్లుగా వంశధార కాలువలో గుర్రపుడెక్క తొలగించకపోవడంతో తమకు శాపంగా మారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వంశధార ఎన్‌టీసీ, 11ఆర్ కిల్లాం కాలువలో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో బొరిగివలస, రావులవలస, కిల్లాం, ఈదులవలస తదితర ప్రాంతాల రైతులకు సాగునీరు అందడం లేదు. ఏటా వేసవిలో అధికారులు, పాలకులు అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు తప్ప తమ సమస్య పరిష్కరించడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాదైనా గుర్రపుడెక్క తొలగించాలని కోరుతున్నారు.

-నరసన్నపేట

ఇటువైపు రావొద్దు

- పోర్టు వాహనాలను అడ్డుకున్న సంతబొమ్మాళి గ్రామస్థులు

సంతబొమ్మాళి, ఏప్రిల్ 7: సంతబొమ్మాళి గ్రామస్థులు ఆదివారం రాత్రి మూలపేట పోర్టు వాహనాలను అడ్డుకున్నారు. సంతబొమ్మాళి పెద్ద కొండ నుంచి కంకరను పెద్ద ఎత్తున లారీల్లో పోర్టుకు తరలిస్తున్నారు. వాహనాలు అతివేగంతో రాకపోకలు సాగిస్తుండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని గ్రామస్థులు ఆరోపించారు. దుమ్ము, ధూళి కారణంగా ఇంట్లో ఉండలేకపోతున్నామని పేర్కొన్నారు. ఈ రహదారి గుండా పోర్టు వాహనాల రాకపోకలు సాగించొద్దని డిమాండ్ చేశారు. వాహనాలను అడ్డుకోవడంతో బారులుదీరాయి. కొద్దిసేపటి తర్వాత వాహనాలను విడిచిపెట్టేశారు.



లారీని అడ్డుకున్న సంతబొమ్మాళి గ్రామస్థులు

తగ్గిన పాలధార!

- ఎండల ప్రభావంతో పశుగ్రాసం కొరత
- ఆందోళనలో రైతులు

(మెళియాపుట్టి)

జిల్లాలో ఎన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వడగాలులు వీస్తున్నాయి. ఆ ప్రభావం పాల దిగుబడిపై పడి ఉత్పత్తి తగ్గిపోయిందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశుసంవర్ధకశాఖ లెక్కల ప్రకారం జిల్లాలో సుమారు గోజాతి పశువులు 4.56 లక్షలు ఉన్నాయి. 40వేల గేదెలు ఉన్నాయి. ప్రతి మూడు నెలలకోసారి పాల దిగుబడి లెక్కిస్తారు. జిల్లాలో ప్రస్తుతం హెరిటేజ్, విశాఖ డెయిరీ సంస్థలు పాడి రైతుల నుంచి పాల సేకరణ చేపడుతున్నాయి. వెన్నశాతం ఆధారంగా ఆవుపాలకు లీటరుకు రూ.35 నుంచి రూ.40 చొప్పున రైతులకు చెల్లిస్తున్నాయి. గేదె పాలకు రూ.60 నుంచి రూ.70 వరకు ఇస్తున్నాయి. గతంలో రోజుకు 7లక్షల లీటర్ల పాలు దిగుబడి వచ్చేవి. వాటిని విక్రయించి చాలామంది రైతులు జీవనాధారం పొందేవారు. ప్రస్తుతం ఎండల తీవ్రతకు సుమారు 5లక్షల లీటర్లకు పాల ఉత్పత్తి తగ్గిందని రైతులు వాపోతున్నారు. ఎండల తీవ్రత పచ్చగడ్డి కొరత ఏర్పడిందని, ఫలితంగా పాల దిగుబడి తగ్గిందని పేర్కొంటున్నారు. దీంతో ఆర్థికంగా తమకు కష్టాలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● మెళియాపుట్టి గ్రామానికి చెందిన దుక్క కృష్ణారావుకు నాలుగు ఆవులు ఉన్నాయి. నెలరోజుల కిందట వరకూ వాటి ద్వారా పూటకు 20 లీటర్ల పాలు వచ్చేవి. వాటిని విక్రయించి కుటుంబంతో జీవనాధారం సాగించేవాడు. ఇటీవల ఎండల పెరగడంతో పాల ఉత్పత్తి 10 లీటర్లకు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

....

● మెళియాపుట్టి మండలం బందపల్లి గ్రామానికి చెందిన సవర నారాయణరావుకు రెండు ఆవులు ఉన్నాయి. పూటకు 15 లీటర్ల పాలు ఇచ్చేవి. గత వారం రోజుల నుంచి 8లీటర్లు మాత్రమే ఇస్తున్నాయి. ఆవుల మేతకు ఖర్చు పెరగ్గా.. పాల దిగుబడి మాత్రం తక్కువగా వస్తోందని నారాయణరావు వాపోతున్నాడు.

....

● టెక్కలి మండలం నర్సింగపల్లికి చెందిన రట్టి మన్మథరావుకు ఒక ఆవు ఉంది. దాని ద్వారా ప్రతిరోజూ పది లీటర్ల పాలు వస్తుండేవి. ప్రస్తుతం ఉష్ణోగ్రతల ప్రభావంతో పాల ఉత్పత్తి తగ్గిందని పేర్కొంటున్నాడు.



నర్సింగపల్లిలో సేకరిస్తున్న పాలు

జాగ్రత్తలు తప్పనిసరి

పశువుల సంరక్షణకు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం 9లోపు, సాయంత్రం 4 గంటల తర్వాత వాటిని మేపునకు తీసుకెళ్లాలి. పశువుల్లో నీరు శాతం తగ్గడం వల్ల పాల దిగుబడి తగ్గుతోంది. వాటికి రెండు పూటలూ అధికంగా నీరు ఇవ్వాలి. పచ్చగడ్డి వేయాలి. ఎండుగడ్డిని నీటితో తడిపి ఇస్తే మంచింది. సంకరజాతి పశువులకు అధిక ఎండ తగలకుండా చూడాలి.

-పి.అనిల్‌కుమార్, పశువైద్యాధికారి, మెళియాపుట్టి

---

12 కేజీల వెండి ఆభరణాలు స్వాధీనం

- మరో రూ.78వేలు పట్టుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్



వ్యాపారిని విచారణ చేపడుతున్న అధికారులు

నరసన్నపేట, ఏప్రిల్ 7: ఎటువంటి పత్రాలు లేకుండా శ్రీకాకుళం నుంచి నరసన్నపేట కారులో తరలిస్తున్న 12.310 కేజీల వెండి పట్టీలను సత్యవరం జంక్షన్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. నరసన్నపేట మఠంవీధికి చెందిన ఈ.సోమేశ్వరరావు అనే వ్యాపారి ఇతర ప్రాంతాలకు వెండి ఆభరణాలు పంపిణీ చేస్తూ తిరిగి స్వగ్రామం కారులో వస్తున్నారు. సత్యవరం జంక్షన్ వద్ద అధికారులు తనిఖీ చేయగా.. 12.310 కేజీల వెండి పట్టీలకు ఎటువంటి బిల్లులు చూపలేదు. రాష్ట్ర పన్నుల శాఖ అధికారుల ఆధ్వర్యంలో విచారణ చేపట్టి.. ఎటువంటి బిల్లులు లేకపోవడంతో వీటిని ఆర్వో జీవీఎస్ రామ్మోహన్‌రావు ఉపఖజానా కార్యాలయానికి అప్పగించారు. కార్యక్రమంలో డీటీ గాయత్రి తదితరులు పాల్గొన్నారు. అలాగే జడూరు జంక్షన్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు తనిఖీలు చేపట్టారు. పోలాకి మండలం రామయ్యవలసకు చెందిన చింతాడ సుగుణ ద్విచక్ర వాహనంపై రాగా తనిఖీ చేశారు. ఎటువంటి ఆధారాలు చూపని రూ.78వేలు పట్టుకున్నట్లు ఆర్వో రామ్మోహన్‌రావు తెలిపారు.

ఏరువాకకు వేళాయే..!

- వ్యవసాయ పనిముట్లు కొనుగోలులో రైతులు నిమగ్నం
- నేడు అమావాస్య, రేపు ఉగాది
- పంచాంగ శ్రవణాలకు ఆలయాల్లో ఏర్పాట్లు

నందిగాం/టెక్కలి: 'ఏరువాక సాగాలో రండో చిన్నన్న' అంటూ ఓ సినీ కవి రాసిన గీతం నేటికీ రైతులు పాడుకుంటూనే ఉంటారంటే వ్యవసాయ పనుల్లో ఏరువాకకు ఎంత ప్రాధాన్యం ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రతి ఏటా కొత్త అమావాస్య మరుసటి రోజున ఉగాది పర్వదినంగా అందరూ నిర్వహిస్తుంటే రైతులు కూడా వ్యవసాయ పనులను ఆరోజే ప్రారంభిస్తారు. ఉగాది పర్వదినాన తెల్లవారుజామునే పవిత్ర స్నానాలు ఆచరించి ఏరుపూని వ్యవసాయ పనులకు శ్రీకారం చుడతారు. వ్యవసాయం చక్కగా సాగి పాడిపంటలు వృద్ధి చెందాలని దేవదేవుని కోరుకుంటారు. దీనికి సంబంధించి పనిముట్లను కొనుగోలుకు గ్రామాల నుంచి సమీపంలోని పెద్ద ఊర్లకు, పట్టణాలకు రైతులు వస్తున్నారు. శనివారం టెక్కలి, నందిగాం మార్కెట్‌లలో మోకులు, పలుపులు, ములకర్రలు, గునితలు తదితర సామగ్రిని కొనుగోలు చేసుకున్నారు. అలాగే


టెక్కలి: చెరకు కర్రలు కొనుగోలు చేస్తున్న మహిళలు


నందిగాం: మోకులు, ములకర్రలు తీసుకువెళ్తున్న వృద్ధుడు

చెరుకుగెడ, పిండివంటలు వండేందుకు అవసరమైన బెల్లం, ఎర్రకంద మాలం, పసుపుకొమ్ములు, మిఠాయిలు, పండ్లు కొనుగోలు చేయడం


టెక్కలి: మోకులు, పలుపులు కొంటున్న రైతులు

కనిపించింది. ఆలయాల్లో ఉగాది నాడు గ్రామ పురోహితులు పంచాంగ శ్రవణం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు. ఈ ఏడాది ఎన్ని కుంచాల వర్షం, ఏ ప్రాంతంలో వర్షిస్తుంది, ఏ రంగు పంటలు పండుతాయి, గోవులకాపరి ఎవరు, రాజు ఎవరు, ఆదాయ, వ్యయాలు, రాజ్యపూజ్య, అవమానం తదితర వివరాలను పురోహితులు వివరిస్తారు. మంగళవారం సూర్యోదయానికి ముందు 4.30 గంటల నుంచి 5.30 గంటల మధ్య ఏరువాక, ఏరుపూత, ముటియలకు శుభప్రదమని పురోహితులు తెలిపారు.

ప్రమాదకరం


చిక్కిడిగాం వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

మందస నుంచి సాబకోట, సింగుపురం రోడ్డులో రహదారి ప్రమాదకరంగా మారింది. చిక్కిడిగాం గ్రామం వద్ద భారీ మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. మలుపు వద్ద సరైన హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళ ఈ మార్గంలో అత్యంత ప్రమాదకరమని, అదుపు తప్పితే ప్రాణాలకే ప్రమాదమని వాహనచోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

-మందస

ఎన్డీఏ ప్రభుత్వంలో అభివృద్ధి: రమణమూర్తి


టీడీపీలో చేరిన రాళ్లపాడు గ్రామస్థులతో రమణమూర్తి

నరసన్నపేట/పోలాకి: గత ఐదేళ్లలో వైసీపీ విధ్వంస పాలన చూశామని, రానున్న ఐదేళ్లలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతో అభివృద్ధికి బాటలు వేయడం జరుగుతుందని ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం పోలాకి మండలం రాళ్లపాడు, ఈదులవలస, ముప్పిడి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

టీడీపీలో చేరిన 200 కుటుంబాలు

పోలాకి మండలం వనిత మండలం, రాళ్లపాడు గ్రామాలకు చెందిన సుమారు 200 వందల వైసీపీ కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరాయి. రాళ్లపాడుకు చెందిన మాజీ సర్పంచ్ బోర రాజు ఆధ్వర్యంలో సుమారు 150 కుటుంబాలు, వనిత మండ లానికి చెందిన ఎన్ని రమేష్, సూర్యారావు, రాకోటి వెంకటరావు ఆధ్వర్యంలో మరో 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి రమణమూర్తి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో తమ సత్తా చూపి ఉమ్మడి అభ్యర్థులను గెలిపించు కుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మిరియపల్లి వెంకట అప్పలనాయుడు, నేతలు బైరి భాస్కరరావు, రాంబాబు, తేజ్‌కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సాగునీరు, ఉపాధి కల్పించేది టీడీపీయే: శిరీష


టీఎస్ఎన్ఎఫ్ ప్రతినిధులతో గౌతు శిరీష

పలాసరూరల్: చేనుకు నీరు, యువతకు ఉపాధి అందించేది టీడీపీ ప్రభుత్వమేనని, రానున్న ఎన్నికల్లో ఉమ్మడి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష కోరారు. నీలావతి పంచాయతీ కొత్తూరు, పెదంచల పంచాయతీ మరదరాజపురం, జగన్నాథపురంలో ఆదివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణరావు, నేతలు పీరికట్ల విఠల్‌రావు, దువ్వాడ సంతోష్, బీజేపీ నాయకుడు రామానందస్వామి, జనసేన నాయకులు సంతోష్ పండా, కిక్కర ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు. ● యువతకు విద్య ఉపాధిని కల్పించేది టీడీపీ ప్రభుత్వమేనని పలువురు యువత అన్నారు. పలాస టీడీపీ కార్యాలయంలో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 'మై ఫస్ట్ ఓట్ ఫర్ బెటర్ ఏపీ' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని కోరారు. కార్యక్రమంలో గౌతు శిరీష, పీరికట్ల విఠల్‌రావు, భావన దుర్యోధన, మల్లా శ్రీనివాసరావు, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి: గోవిందరావు


ప్రచారం నిర్వహిస్తున్న ఎంజీఆర్

కొత్తూరు: రానున్న ఎన్నికల్లో తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావు (ఎంజీఆర్) కోరారు. వసప, కుంటి భద్రకాలనీ, కుంటిభద తదితర గ్రామాల్లో జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఆదివారం ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కలిగించారు. సేవా భావంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని, సేవ చేసే భాగ్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి పార్టీల నేతలు సలాన శరత్ కుమార్, చోడవరపు గోవిందరావు, దుక్క శ్రీకాంత్‌రెడ్డి, మాతల గాంధీ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం

నందిగాం: హరిదాసుపురంలో ఆదివారం సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పి.అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు ఎం.బాలకృష్ణ, టి.మహేష్, బి.గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడుకు పరామర్శ


అచ్చెన్నాయుడును పరామర్శిస్తున్న అధికార ప్రతినిధి పట్టాభిరామ్

టెక్కలి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు తల్లి కళావతి మృతి చెందడంతో ఆదివారం పలువురు నేతలు ఆయనను పరామర్శించారు. టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కె.పట్టాభిరామ్ నిమ్మాడలో కళావతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే తాడేపల్లి పార్టీ ఇన్‌చార్జి వలవల బాబ్జీ, టీడీపీ అధికార ప్రతినిధి జ్యోత్స్న, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పలువురు టీడీపీ మహిళా ప్రతినిధులు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

టీడీపీలో చేరిన శివాజీనగర్ వైసీపీ నేతలు

పలాస: టీడీపీతోనే పలాస అభివృద్ధి సాధ్యమని ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. ఆదివారం స్థానిక 3వ వార్డు శివాజీనగర్‌లో స్థానికులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి శిరీష కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో మద్దు పాపారావు, బిరి యాల భిల్లుతో పాటు వంద కుటుంబాలున్నాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, సప్ప నవీన్ తదితరులు పాల్గొన్నారు. ● **హరిపురం:** మందస మండలం సాబకోట పంచాయతీ వైస్ సర్పంచ్ సవర గౌరి తన అనుచరులతో కలిసి సుమారు 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి శిరీష కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బావన దుర్యోధన, దాసరి తాతారావు, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య పాల్గొన్నారు. ● **జలుమూరు:** యలమంచిలి గ్రామం వైసీపీకి చెందిన 30 కుటుంబాలు ఆదివారం టీడీపీలో చేరాయి. మబగాంలోని స్వగృహంలో ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. యలమంచిలికి చెందిన బొమ్మాళి ఆదినారాయణ, పెంటయ్య, కామేశ్వరరావు, రావులవలస అప్పన్న, మల్లేసు, అప్పారావుతో పాటు 30 కుటుంబాలు టీడీపీలో చేరారు. అలాగే అల్లాడ, అల్లాడపేట, రామదాసుపేట గ్రామాల్లో మాజీ జడ్పీటీసీ బగ్గు సుగుణమ్మ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, కన్వీనర్ బగ్గు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. ● **వజ్రపుకొత్తూరు:** కొమరల్తాడలో టీడీపీ ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం చేపట్టారు. చేపట్టింది. పూండి క్లస్టర్ ఇన్‌చార్జి పుచ్చ ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పుచ్చ శోభారాణి, కర్ని రమణ, దున్న షన్ముఖరావు ఉన్నారు. ● **సంతబొమ్మాళి:** టీడీపీ ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాలు అమలవుతాయని ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు రెడ్డి, అప్పన్న, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అట్టాడ రాంప్రసాద్ అన్నారు. ఆదివారం నౌపడ పంచాయతీ పాలనాయుడు పేట, జగన్నాథ పురం, కూర్మనాథపురం గ్రామాల్లో సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించండి

టెక్కలి: ఎన్నికల నాటికి పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదు పాయాలు కల్పించాలని సబ్ కలెక్టర్, టెక్కలి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ బీఎల్వోలకు ఆదేశించారు. ఆదివారం సొర్లి గాం, లింగాలవలస, పోలవరం, రాధావల్లభాపురం, తెలినీలాపురం, వేములవాడ తదితర పోలింగ్ కేంద్రాలను ఏఆర్వో మురళీకృష్ణతో కలిసి పరిశీలించారు. 80 ఏళ్ల దాటిన ఓటర్లు ఎంతమంది, బెడ్‌రిడెన్ ఎంతమంది తదితర వివరాలను ఆరా తీశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద షామియానా, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ర్యాంప్‌లు ఉండాలని సూచించారు.

పోటీ పరీక్షలు ప్రేరణ కలిగిస్తాయి


బహుమతులు పొందిన విద్యార్థులతో ఎంఈవోలు, సంఘ ప్రతినిధులు

పలాసరూరల్: పోటీ పరీక్షలు విద్యార్థుల్లో ప్రేరణను కలిగిస్తా యని ఎంఈవోలు సీహెచ్ శ్రీనివాసరావు, ఎం.సత్యం అన్నారు. కాశీబుగ్గ ఒడియా స్కూల్ ఆవరణలో ఆదివారం వజ్రపు కొత్తూరు, పలాస మండలాలకు సంబంధించి 5వ తరగతి ఒడియా విద్యార్థులకు అపోటా ఆధ్వర్యంలో జిల్లా మేధా సమ్మాన్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో అపోటా గౌరవాధ్యక్షుడు ఖగేశ్వరదొర, చక్రపాణిప్రధానో, ఎల్ఎన్ పండా, పలాస మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.నాగేశ్వరరావు, నాగేశ్వరపాత్రో, కృష్ణచంద్ర పాత్రో తదితరులు పాల్గొన్నారు.

ఒడియా విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

టెక్కలి: ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 5వ తరగతి విద్యార్థులకు ఆదివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పోటీల్లో టెక్కలి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన ఒడియా విద్యార్థులు పాల్గొనగా విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఒడియా ఉపాధ్యాయులు సుభాష్, జుదిష్ఠి, శ్యామలావతి తదితరులు పాల్గొన్నారు.

బూరగాం పాఠశాలలో..



పాతపట్నం: బూరగాం స్కూల్ కాంప్లెక్స్‌లో హెచ్ఎం విశ్వనాథ బొరాడొ ఆధ్వర్యంలో ఆదివారం ఒడియా టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పలు మండలాల నుంచి ఒడియా విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో హరిబిశ్వాల్, గణేష్ బరోడ, భీంసేన్ పండ, వినోదిని దేవి తదితరులు పాల్గొన్నారు.

'ఓట్లు అడిగే హక్కు మంత్రికి లేదు'

పలాస: రాష్ట్రంలో వైసీపీ పాలించే అర్హత కోల్పోయిం దని, మంత్రి అప్పలరాజుకు ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కులేదని టీడీపీ యువ జన నాయకుడు, సామాజిక కార్యకర్త మన్నాల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ.. సంక్షేమ పథకాల పేరుతో ఐదేళ్ల కాల యాపన చేసి అభివృద్ధిని మరిచిపోయారన్నారు. మంత్రి అప్పలరాజు ఇచ్చిన హా మీలు నెరవేర్చలేదని, ప్రజల వద్దకు ఏ విధంగా వెళతా రన్నారు. హామీలను మరిచిన మంత్రి అప్పలరాజు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

సోమవారం సంతలో చింతలెన్నో..

- ఆదాయం ఘనం... అభివృద్ధి శూన్యం

నరసన్నపేట: నరసన్నపేటలో సోమవారం సంతలో అనేక సమస్యలతో ఇటు వ్యాపా రులు, అటు కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సంతకి ఏడాదికి లక్షల్లో ఆదాయం పంచాయతీకి వస్తున్నా ఎటువంటి అభివృద్ధి చేపట్టకపోవడంపై విమర్శలు వినిపి స్తున్నాయి. నరసన్నపేటలో సోమవారం జరిగే సంతకు నరసన్నపేట, జలుమూరు, పోలాకి మండలాల నుంచి కొనుగోలుదారులు వస్తుంటారు. అయితే సంత మొత్తం గోతులమయమవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. సంత స్థలాన్ని ఒక వైపు ఆక్రమణదారులు ఆక్రమిస్తున్నారు. ఇళ్ల వ్యర్థాలను ఈ సంతలోనే వేసేస్తున్నారన్న విమర్శలొస్తున్నా యి. వర్షం వస్తే సంత అంతా బురదమయంగా తయా రవుతోంది. పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గతే డాది ఆశీలు పాటలో రూ.4 లక్షలు ఆదాయం వచ్చింది. అయినా రూపాయి పని కూడా చేయలేదు. ఈ ఏడాది మరో రూ.4.30 లక్షలు


సంత ఆవరణలో బిల్డింగ్ వ్యర్థాలు వేసిన దృశ్యం

ఆదాయం వచ్చింది. ఆక్రమణలను తొలగించి సంతలో కనీస సదుపాయాలు కల్పించాలని వ్యాపారులు, కొనుగోలుదారులు కోరుతున్నారు. ఈ విషయమై ఈవో చిన్నారావు వద్ద ప్రస్తావించగా పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేస్తే నిధులు కేటాయించడం జరుగుతుందని, తన చేతిలో ఏమీ లేదన్నారు.

ఆరేళ్లయినా.. అదే పరిస్థితి

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఇదీ హైవే నుంచి మాలపేట రోడ్డు దుస్థితి

నందిగాం, ఏప్రిల్ 7: నందిగాం జాతీయరహదారి నుంచి మాలపేట వయా బెజ్జిపల్లి, పోతులూరు, చిన్నతామరాపల్లి రోడ్డు ఆరేళ్లయినా నిర్మాణం పూర్తికాలేదు. దీంతో ఈ ప్రాంత వాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2018 జనవరిలో రూ.2.25 కోట్ల అంచనాతో సుమారు 5.56 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి అప్పటి మంత్రి, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులు చురుగ్గా ప్రారంభమైనా బీటీ రోడ్డు పనుల నిర్మా ణంలో కాంట్రాక్టర్లు అలసత్వం వహించడంతో పనుల్లో పురోగతి కనిపించలేదు. ఆ తరువాత ప్రభుత్వం మారడం రోడ్డు నిర్మాణంపై ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. టీడీపీ హయాంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో అటు మాలపేట, ఇటు పోలవరం దళిత గ్రామాలు లింకు ఉండడంతో అధిక ప్రాధాన్యం ఇచ్చారు. అనం తరం ప్రభుత్వం మారిపోవడంతో బిల్లులు జాప్యంతో కాంట్రాక్టర్ బీటీ నిర్మాణానికి ముం దుకు రాకపోవడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచి పోయాయి. దీంతో ఈ రహదారిలో రాళ్లు తేలి నిత్యం వాహనచోదకులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఈ రహదారి నిర్మాణానికి పాలకులు, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


మాలపేట-బెజ్జిపల్లి రహదారి దుస్థితి

గ్రామాల్లో తాగునీటి కష్టాలు


జలుమూరులో సైకిల్‌పై తాగునీటిని తీసుకెళుతున్న దృశ్యం

జలుమూరు: వేసవి ప్రారంభంలోనే తాగునీటి కష్టాలు వెన్నాడుతున్నాయి. అచ్యుతాపురం తాగునీటి ప్రాజెక్టు నుంచి మండలంలోని 45 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు మోటార్ పాడై వారం రోజులవుతున్నప్పటికీ నేటికీ బాగు చేయిం చక పోవడంతో ఆయా గ్రామాల్లో ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. శ్రీముఖలింగం, నగిరికటకం, బుడితి, జలుమూరు, పాగోడు, గుగ్గిలి తదితర గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తింది. వేసవిని దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులు ఆదేశించినా మండల స్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లో ప్రజలు దాహార్తితో ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రమైన జలుమూరులో ఇంటింటి కొళాయిల నుంచి నీరు రాకపో వడంతో పొలాల్లోని వ్యవసాయ బావుల నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఎదురవు తోందని గ్రామ స్థులు ఆందోళన చెందు తున్నారు. జలుమూరులో ఉన్న బోర్ల నుంచి ఉప్పునీరు కావడం పోలీసు స్టేషను ఎదురుగా ఉన్న ఒక్క బోరు నుంచి మాత్రం మంచినీరు వస్తుండడంతో అన్ని వీధుల వారు అక్కడికి వచ్చి నీటిని తీసుకువెళుతున్నారు. మహిళలు బిందెలతోను, మగవారు సైకిళ్లు, ద్విచక్ర వాహనాలు, కావిళ్లతో నీటిని ఇళ్లకు తీసుకువెళ్లాల్సిన పరిస్థితి ఎదురైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని తాగునీటి ఎద్దడిని నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బిత్తరబందలో..

హరిపురం: సాబకోట పంచాయతీ బిత్తరబంద గిరిజన గ్రామంలో తాగునీటి కష్టాలు తీవ్రమయ్యాయి. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. గ్రామానికి ప్రధాన ఆధారమైన బావి కూలిపోవడంతో నీటికోసం మైళ్లదూరంలోని సింగుపురం గ్రామానికి వెళ్లాల్సి వస్తోందని గ్రామస్థులు తేనంగి గణపతి, సవర సాంబేరి తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గ్రామ శివారులో కొందరు వ్యక్తులు భూమి పనులకు ఉపయోగించిన ఎక్స్‌కవేటర్‌తో బావి పాడైంది. దీంతో గ్రామస్థులకు నీటి ఇబ్బందులు ఎదురయ్యాయి. బావిని బాగు చేసి నీటి అవసరాలు తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.


బిత్తరబందలో ధ్వంసమైన బావి

క్యాన్సర్ బాధితులకు ఆర్థిక సాయం

కొత్తూరు: భామిని మండలం పెద్దదిమిలి గ్రామస్థుడు గంట త్రిమూర్తి కుమారుడు చిన్న అబ్బాయి క్యాన్సర్‌తో బాధపడుతుండగా భగత్ సింగ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు స్పందించి రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. కొత్తూరు దేవాంగులవీధిలో బొమ్మాళి మోహన్ క్యాన్సర్‌తో మంచానికి పరిమితం కాగా ఆయనకు రూ.20 వేలు నగదు అందించారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి


ఎన్నికల నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

హిరమండలం: త్వరలో జరగనున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కొత్తూరు సీఐ వేణుగోపాలరావు అన్నారు. ఆదివారం కొండరాగోలు గ్రామంలో ఎన్నికల నిబంధనలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. ఎన్నికల ప్రచారం, ఓటర్లను ప్రభావితం చేయడానికి ప్రయత్నించడం, భయాం దోళలను రేకెత్తించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల మధ్య శత్రుత్వం పెరి గేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదన్నారు. ఓట్ల కోసం లంచం ఇవ్వడం ప్రలోభ పెట్టడం చేయరాదన్నారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియో గించుకునేలా సహకరించాలన్నారు. ఎస్ఐ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిధులు లేక.. నిర్వహణకు నోచుకోక

- పూడిక పేరుకుపోయిన వైనం ● మరమ్మతులు ప్రతిపాదనలకే పరిమితం
- ఇదీ మునిసిపాలిటీ పరిధిలో చెరువుల పరిస్థితి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మునిసిపాలిటీ పరిధిలో గల చెరువుల నిర్వహణకు నిధుల కొరత వెంటాడుతోంది. దీంతో దశాబ్దాలుగా మరమ్మతులు లేకపోవడంతోపాటు పూడిక పేరుకుపోయాయి. చెరువుల్లో నీరు చేరుతున్నా తాగేందుకు వినియోగించలేని పరిస్థితి నెలకొంది. ఈనేపథ్యంలో మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నా నిధులు మంజూరుకావడంలేదు.

ఇదీ పరిస్థితి..

మునిసిపాలిటీ పరిధిలోని సయ్యద్‌ఖాన్, ఎర్రచెరువు, కోదండ రామ, కోమటి చెరువు,దాసన్నపేటజంక్షన్, బెల్లుపడకాలనీ, దానంపేట, గిలాయివీధి, ఏఎస్‌పేట, పురుషోత్తపురం, రత్తకన్నలోని చెరువులు ఇక్కడ తాగునీటి అవసరాలకోసం తవ్వారు. మునిసిపాలిటీగా మారక ముందు చెరువులను పంచాయతీ పాలకవర్గాలు సక్రమంగా నిర్వహించేవి. మునిసిపాలిటీలో చేరిన తర్వాత నిధుల కొరత, పట్ట ణంలో వ్యర్థాలు చేరడం వెరసి వీటి పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారింది. ఏళ్ల తరబడి నిర్వహణ లేక పూడికపేరుకుపోవడంతో నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. దీనికితోడు చెరువుల్లో చెత్త, వ్యర్థాలు చేరుతుండడంతో దుర్వాసన వెలువడుతోంది. గతంలో ఈ చెరువులు స్నానాలకు వినియోగించేవారు. తాగునీటి అవసరాలు తీర్చేవి. రానురాను నిర్వహణపై అధికారులు శ్రద్ధ కనబరచపోవడంతో చెరువులు నిరుపయోగంగా మారాయి. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం కూడా చెరువుల అభివృద్ధికి కనీసం చర్యలు తీసుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీనికితోడు మునిసిపాలిటీ ఆదాయం అంతంతమాత్రం కావడంతో సాధారణ నిధుల నుంచి కూడా వెచ్చించలేని పరిస్థితి నెల కొంది. పట్టణంలో పెద్ద చెరువులతో పాటు చిన్న చెరువులు కూడా కనీస అభివృద్ధికి నోచుకోవడంలేదు. ఈనేపథ్యంలో చెరువుల్లో నీరు రంగు మారడంతో వినియోగించలేకపోతున్నామని పట్టణ ప్రజలు చెబుతున్నారు. అన్ని చెరువుల్లోనూ భారీగా పూడికలు పేరుకుపోయినా మునిసిపల్ పాలకులు చోద్యంచూస్తున్నా తొలగింపునకు చర్యలు తీసుకోలేదన్న విమర్శలొస్తున్నాయి. దాసన్నపేట జంక్షన్, బెల్లుపడ కాలనీ, దానంపేట, గిలాయివీధి, ఏఎస్‌పేట, పురుషోత్తపురం, రత్తకన్న చెరువులు అడుగంటిపోవడంతో పశువుల తాగడానికి అవస్థలు తప్పవన్న ఆందోళన నెలకొంది. ఈనేపథ్యంలో ప్రస్తుతం పట్టణంలో ప్రజలకు తాగునీటి సమస్యతోపాటు సాధారణ వినియోగానికి కూడా నీటి సమస్య తలెత్తుతోంది. సయ్యద్‌ఖాన్ చెరువు నీటిని 4,5,6,7,8, 23 వార్డుల ప్రజలు వాడుకోవడానికి, స్నానాలకు ఉపయోగించేవారు. ప్రస్తుతం చెరువులో నీరు అడుగంటడంతోపాటు చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లడంతో వినియోగించలేని పరిస్థితి నెలకొంది.



పూడికలతో నిండిన సయ్యద్‌ఖాన్ చెరువు



అడుగంటిన ఎర్రచెరువు

మరమ్మతులకు నిధులు లేవు..



మునిసిపాలిటీ పరిధిలో ఉన్న ప్రధాన చెరువులు మరమ్మతులకు చేయడానికి నిధులు లేవు. చెరువులు మరమ్మతులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కలెక్టర్‌ను కూడా కోరాం. నిధులు మంజూరైతే చెరువులను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయిస్తాం.

-ఎన్.రమేష్, మునిసిపల్ కమిషనర్

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

టెక్కలి: మండలంలోని అక్కవరం దరి జాతీయరహదారిపై ఆదివారం మధ్యాహ్నం గుర్తుతెలియని వాహనం ఢీకొని ముంజేటి గురయ్య అనే 70ఏళ్ల వృద్ధుడు అక్కడికక్కడే మృతిచెందాడు. శ్యామసుందరాపురంలోని తన కుమార్తె వద్దకు వెళ్లిన గురయ్య తిరిగి వస్తుండగా జాతీయరహదారిపై గుర్తుతెలియని లారీఢీకొంది. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతుడిది కోటబొమ్మాళి మండలంలోని రెహమాన్‌పురం గ్రామంగా తెలుస్తోంది.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పలాస రూరల్: మండలంలోని దానగొరలో మద్యం మత్తులో సవర రవికుమార్ ఇంట్లో కొక్కెనికి ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మద్యానికి బానిసైన రవికుమార్ రోజుమద్యం సేవించి కుటుంబ సభ్యులు, స్థానికులతోవివాదానికి దిగేవాడని గ్రామస్థులు చెబుతున్నారు.ఈవిషయంపై కుటుంబసభ్యులు పలుసార్లు మందలించడంతో ఉరివేసుకుంటానని బెదిరించే వాడు. ఈనేపథ్యంలో ఆదివారంఉదయం కుటుంబసభ్యులు మందలించడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పారినాయుడు తెలిపారు.

5,600 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం



పట్టుబడిన సారా తయారీకి వినియోగించే డ్రమ్ములు

మెళియాపుట్టి: మండలంలోని భరణికోట, బాలేరు, మర గ్రామాల్లో ఆదివారం ఎస్‌ఈబీ స్థానిక పోలీసులు దాడులు చేసి 5,600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ రామచంద్రకుమార్ తెలిపారు. బెల్లం ఊటలతోపాటు 120 లీటర్ల సారా పట్టుకున్నట్లు చెప్పారు. సారా తయారీకి బెల్లం అందించిన వ్యాపారులపై కేసులు నమోదుచేస్తామని తెలిపారు. దాడులో పాతపట్నం, మెళియాపుట్టి ఎస్‌ఐలు టి.రాజేష్, మహ్మద్‌అలీ, ఎస్‌ఈబీ అధికారులు పద్మాలోచన్ తదితరులు ఉన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన

కంచిలి:మండలంలోని ప్రధానపుట్టుగ, మజ్జిపుట్టుగల్లో సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ మండల కార్యదర్శి మాదిన రామారావు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి మర్రిపాటి పూర్ణ అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పైల రామారావు, సూర్యనారాయణరెడ్డి, పిలక చినబాబురెడ్డి, రమేష్‌రెడ్డి, బొడ్డ రామ్‌కుమార్, హరిబాబు, దుర్గాశ్రీనివాస్, ఇందు, నిరంజన్, ప్రదీప్, భాస్కర్ పాల్గొన్నారు.

●**ఇచ్ఛాపురం:** మండలంలోని బాలకృష్ణాపురంలో సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకులు ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం భవిష్యత్ కోసం ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కోట రామారావు, మాజీ ఎంపీపీలు దక్కత ఏకాంబరీదేవి, దక్కత ఢిల్లీరావు, తాళ్ల గోపి, దక్కత కామేష్, పద్మనాభం పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించక.. పనులు కాక

- ఇదీ శాలిహుండం హెల్త్‌సెంటర్ పరిస్థితి



అర్ధాంతరంగా నిలిచిపోయిన హెల్త్ సెంటర్ భవనం

గార: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించే ఉద్దేశంతో ప్రభుత్వం శాలిహుండం గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన హెల్త్ సెంటర్ భవనం నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. శాలిహుండం సచివాలయభవనానికి ఆనుకుని మూడేళ్ల కిందట రూ.17.50లక్షలు వ్యయంతో హెల్త్‌సెంటర్ భవనం పనులు ప్రారంభించారు. అయితే కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో శ్లాబ్‌స్థాయిలో పనులు నిలిచిపోయాయి. మొదట్లో ఏడాదిపాటు పనులు వేగంగా జరిగినా తర్వాత బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. ఈ హెల్త్‌సెంటర్ పరిధిలో శాలిహుండాం, కొత్తపేట, తంగుళ్లపేట, కొంక్యాణపేట, వేణుగోపాలపురంగ్రామాల్లో 2000 మందికి సేవలం దించాల్సిఉంది. ఇప్పటి వరకూ వీరంతా గార పీహెచ్‌సీకి వెళ్లాల్సి వస్తోంది.గ్రామంలోనే వైద్యసేవలందించాలన్న లక్ష్యంనిర్మించిన హెల్త్‌సెంటర్ పనులు ముంద కు సాగడంలేదు. ఈనేపథ్యంలో ప్రస్తుతం గ్రామంలోని ఓ అద్దెభవనంలో హెల్త్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. ఎన్నికల పూర్తయిన తర్వాత పనులు పూర్తిచేస్తామని మండల ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.

దారికాచి.. దాడిచేసి

- ఇచ్ఛాపురంలో కుక్కల స్వైరవిహారం ● పెరుగుతున్న బాధితులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణ వాసులను కుక్కలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. చీకటిపడిన తర్వాత దారి కాచి దాడిచేస్తున్నాయని పలువురు వాపోతున్నారు. దీంతో వీధుల్లోకి రాలేకపోతున్నామని పలువురు వాపోతున్నారు. మునిసిపాలిటీలోని 23 వార్డుల్లోనూ వీధుల్లో కుక్కల స్వైరవిహారం చేస్తున్నాయి.ఇటీవల పలుచోట్ల మాంసం, చేపల దుకాణాలు ప్రారంభించారు. వీటి నిర్వాహకులు వ్యర్థాలు అక్కడే వేస్తుండడంతో కుక్కలు వాటికోసం తిష్ఠవేసి దారిన వెళ్లేవారిపై దాడిచేస్తున్నాయి. ద్విచక్రవాహన చోదకులను వెంబడిస్తున్నాయి. కొందరు వేగంగా వెళ్లి వాహనం బోల్తా పడుతుండడంతో గాయపడుతున్నారు. రహదారిపై ఒంటరిగా వెళ్లే పాదచారులను వెంబడిస్తున్నాయి. రాత్రిపూట పంజావీధి, రథంవీధి, పాతబ్యాంక్‌రోడ్డు జంక్షన్ల వద్ద వందలాది కుక్కలుగుంపులుగా సంచరించి దాడిచేస్తున్నాయని పలువురు వాపోతున్నారు. రాత్రిపూట రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు సైతం భయాందోళన చెందుతున్నారు. స్థానికఆస్పత్రిలో కుక్కకాటు బాధితుల సంఖ్య పెరుగుతోంది. దీంతో పిల్లలను బయటకు పంపించేందుకు తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. కుక్కల సంతతిని నిరోధించేందుకు శస్త్రచికిత్సలు చేయించాలన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను మునిసిపల్‌అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలొస్తున్నాయి. పట్టణంలో ఒక్కమార్చినెలలోనే 330 మందిని కాటేశాయి. కొద్దిరోజులుగా రోజుకు పదిమంది చొప్పున కుక్కకాటు బాధితులు ఆస్పత్రికి చికిత్సకోసం వస్తున్నారని సూపరింటెండెంట్ దేవేంద్రరెడ్డి తెలిపారు. కాగా కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్ చెప్పారు.ఇప్పటికే కౌన్సిల్ సమావేశాల్లో సభ్యులు ఈ విషయంపై చర్చించినట్లు తెలిపారు. వారంరోజుల్లో అత్యవసర సమావేశం నిర్వహించి నిధులుమంజూరు చేసి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.



రథం వీధి- పంజా వీధి జంక్షన్‌లో రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలు

శుద్ధ జలం ఎక్కడ జగన్: ఎంపీ



కాళీప్రసాద్ దంపతులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ,ఎమ్మెల్యేలు

కవిటి: ఉద్దానానికి శుద్ధజలాన్ని ఇస్తున్నామని చెప్పిన జగన్‌రెడ్డి ఆ నీరు ఎక్కడ ఇస్తున్నారో చెప్పాలని ఎంపీ కె.రామ్మోహన నాయుడు ప్రశ్నించారు. ఆదివారం కొండిపుట్టుగలో సర్పంచ్ ఎం.కుమారి, కాళీప్రసాద్ టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ రూ.700 కోట్లు వెచ్చించి తాగు నీరందిస్తున్నామని గొప్పలు చెప్పడంకాదని, ఎక్కడ ఏ గ్రామానికి నీరందిస్తున్నారో చూపాలన్నారు. ఎమ్మెల్యే అశోక్ రానున్న ఎన్నికల్లో వైసీపీని గెలిపిస్తే పరిస్థితి ఎంత అధ్వానంగా మారుతుందో ప్రజలకు వివరించారు. ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు పాల్గొన్నారు.

కూటమిని ఆశీర్వదించాలి: రవికుమార్



కనుగులవలసలో అప్పారావుకు పార్టీ కండువా వేస్తున్న రవికుమార్

ఆమదాలవలస/సరుబుజ్జిలి: వైసీపీ విముక్తి రాష్ట్రం చేయడానికి ప్రతి ఒక్కరూ ఎన్డీఏ కూటమిని ఆశీర్వదించాలని టీడీపీ ఆమదాలవలస నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి కూన రవికుమార్ కోరారు. ఆదివారం మండలంలోని కనుగులవలస, తమ్మయ్యపేట, కంచరాపువానిపేట, కలివరంల్లో టీడీపీ మండలాధ్యక్షుడు నూకరాజు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.బీజేపీ, జనసేన కన్వీనర్లు సూరపునాయుడు, రామ్మోహన్‌తో కలిసి రవికుమార్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు.సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస పంచాయతీకి చెందిన వైసీపీ వార్డు సభ్యుడు సురవరపు అప్పారావు టీడీపీలో చేరారు. ఈమేరకు కనుగులవలసలో కూన రవికుమార్ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీనాయకులు తమ్మినేని విద్యాసాగర్, మొదల వలస రమేష్, మెట్ట సుజాత, తమ్మినేని చంద్రశేఖర్, సనపల డిల్లీశ్వరరావు,అన్నెపు భాస్కరరావు, హనుమంతు బాలకృష్ణ, బొడ్డేపల్లి విజయ్‌కుమార్, కంచరాన లోకేష్ పాల్గొన్నారు.

భూదందాలతో కోట్లు కూడబెట్టిన ధర్మాన: శంకర్



ప్రచారంలో భాగంగా ఇస్త్రీచేస్తున్న శంకర్

అరసవల్లి: భూదందాలతో మంత్రి ధర్మాన కోట్లాది రూపాయలు కూడబెట్టారని, అభివృద్ధి అంటే ఆయనదేనని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి గొండు శంకర్ తెలిపారు. ఆదివారం శ్రీకాకుళం నగరంలోని 49వ డివిజన్ పరిధిలోని పీఎన్‌కాలనీలో సూపర్‌సిక్స్ పథకాలను ఇంటింటా వివరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చాక నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, చింతపల్లి దుర్గారావు గాంధీ, పైడి హరికృష్ణ, పప్పల రామారావు భరత్, జగదీష్, భగత్, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి కోరాడ హరగోపాల్,బొల్ల నాగేంద్ర యాదవ్, అంబటి లక్ష్మీరాజ్యం, పేట పద్మావతి పాల్గొన్నారు.

సోంపేటలో గ్రామీణ వైద్యుల సమావేశం

సోంపేట: సోంపేటలో గ్రామీణవైద్యుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా పలాస కిడ్నీరీసెర్చ్‌సెంటర్ వైద్యాధికారి యర్రరాకేష్ కిడ్నీ వ్యాధి నుంచి ఎలాబయటపడాలి, వ్యాధివచ్చిన తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు.కార్యక్రమంలో గ్రామీణవైద్యులసంఘ అధ్యక్షుడు బత్తుల షణ్ముఖరావు,సోంపేట,కంచిలి,కవిటి, మందస మండలాలగ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

కూటమి గెలుపుతోనే అభివృద్ధి: కలిశెట్టి



జయహో బీసీ కార్యక్రమంలో పాల్గొన్నఅప్పలనాయుడు, ఈశ్వరరావు

రణస్థలం: టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల కూటమి గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని విజయనగరం ఎంపీఅభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే అభ్యర్థి నడికుదిటి ఈశ్వరరావు తెలిపారు. ఆదివారం ఎచ్చెర్లమండలంలోని ఎస్ఎస్ఆర్‌పురంలోజయహో బీసీకార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీజిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరినారాయణమూర్తి, ఎచ్చెర్ల, జి.సిగడాం మండలాల టీడీపీఅధ్యక్షులు బెండు మల్లేశ్వరరావు, కుమరాపురవి, నాయకులు గాలి వెంకటరెడ్డి, అన్నెపు భువనేశ్వరావు, బోర్రశ్రీనివాసరావు, బల్లాడఅరుణ, గాలి వెంకటరెడ్డి, అల్లుపల్లిరాంబాబు, గట్టెం శివరామ్, అన్నంనాయుడు పాల్గొన్నారు.

బీజేపీలో ఇద్దరి వలంటీర్ల చేరిక

రణస్థలం: మండలంలోని సంచాం గ్రామానికి చెందిన వలంటీర్లు బొంతు గణేష్, సత్యనారాయణఆదివారం తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. వీరికి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు బీజేపీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో గొర్లె శ్రీహరి, గిరిబాబులతోపాటు పలువురు టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణానికి ముందుకురావాలి

- జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్



పోటీల్లో గెలుపొందిన వారికి జ్ఞాపికలను అందజేస్తున్న జేవీవీ సభ్యులు

గుజరాతీపేట: శాస్త్రీయ సమాజ నిర్మాణానికి కవులు ముందుకురావాలని జన విజ్ఞానవేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ కోరారు. ఆదివారం శ్రీకాకుళంలోని యూటీఎఫ్ భవన్‌లో సంఘ జిల్లా అధ్యక్షుడు కుప్పిలి కామేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సందర్భంగా గిరిధర్ అశాస్త్రీయ భావనలు, మూఢనమ్మకాలు పెరుగుతున్న నేపథ్యంలో శాస్త్రీయ సమాజం, ప్రజాసంక్షేమం కోసం కవులు, రచయితలు తమ రచనలతో ప్రజానీకాన్ని చైతన్యవంతం చేయాలని కోరారు. ఉగాది పురస్కరించుకుని సమాజాభివృద్ధిలో యువత పాత్ర అన్న అంశంపై జనవిజ్ఞాన వేదిక ఇచ్చిన పిలుపు మేరకు పలువురు కవులు, రచయితలు కవితలు, వ్యాసాలు పంపంచడం అభినందనీయమని తెలిపారు. ఇందులో గెలుపొందిన వారికి జ్ఞాపికలు అందజేశారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- శ్రీకాకుళం సీఐ సన్యాసినాయుడు



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

శ్రీకాకుళం రూరల్: ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలనిశ్రీకాకుళం సీఐ ఎల్.సన్యాసినాయుడు కోరారు.రూరల్ మండలంలోని కుందువానిపేటలో ఆదివారంరాత్రి కేంద్ర బలగాలు, రూరల్ పోలీసులతో కలిపి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. గ్రామంలోని పోలింగ్‌కేంద్రాలతోపాటు ఎన్నికల జరిగే సమయంలో ప్రజలు వినియోగించే మార్గాలు, ఓటు హక్కు వినియోగించే మార్గాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అల్లర్లకు తావిచ్చే వ్యక్తులు గ్రామల్లో అలజడి లేపితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐ వాసు పాల్గొన్నారు.

నీరజకు విశిష్ట ఉగాది పురస్కారం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని అభినయ నృత్యనికేతన్ నృత్య దర్శకురాలు తిమ్మరాజు నీరజా సుబ్రహ్మణ్యానికి విశిష్ట ఉగాది కళాపురస్కారం లభించింది.విశాఖలో ధ్యాన అన్నమయ్య ట్రస్ట్ అండ్‌స్పై ఆర్గనైజేషన్ పబ్లిక్ లైబ్రరీలో ఉగాది కళాఉత్సవం ఆదివారం నిర్వహించారు.ఈసందర్భంగా కూచిపూడి, భరతనాట్యంలో సేవలందిస్తున్న కళాకారులకు ఉగాది పురస్కారాలు అందజేశారు.

ఒడియా విద్యార్థులకు మేధా సమ్మాన్ పరీక్ష

కవిటి: పెద్దమెళియాపుట్టుగ ఉన్నతపాఠశాలలో ఏపీఒరియాటీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి ఒరియా మేధా సమ్మాన్ ప్రతిభ పరీక్షను నిర్వహించారు.ఈసందర్భంగా ఎర్రడొంబురు(పెద్దఎర్రగోవిందపుట్టుగ) టి.నిషిత (రాజపురం),సౌమ్యప్రదాన్(మెళ్లిపుట్టుగ) ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఐదోతరగతి విద్యార్థులు మొదటిమూడు స్థానాలు సాధించారని ఒరియా అసోసియేషన్ మండలాధ్యక్షుడు కేశవపురియా తెలిపారు.విజేతలకు ఎంఈవో ధనుంజయమజ్జి బహుమతులను అందజేశారు.కార్యక్రమంలో ఉమామహాపాత్రో, లింగరాజు పట్నాయక్‌ప్రమోద్‌కుమార్‌పాడిశ్రీధర్ సామంత్ పాల్గొన్నారు.

● **ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురం మునిసిపాలిటీ పరిధిలోగల ఒడియా ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఐదోతరగతి ఒడియా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఒడియా ఉపాధ్యాయ సంఘ ప్రతినిధి అశోక్ జాదవ్, డిల్లేశ్వరశెట్టి, రఘునాథ గౌడో, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**సోంపేట :** బేసిరామచంద్రపురంలో ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (అపోటా) సోంపేట శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి మేధాసమ్మాన్ ప్రతిభా పరీక్షలు విద్యా ర్థులకు నిర్వహించారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి, కేంద్రకమిటీ సభ్యులు రఘునాథపాడి, ఎస్.గోపాల్, కృష్ణ, రవికుమార్, రాజేంద్రపండా, రామ్‌హరిపాడి పాల్గొన్నారు.



కవిటి : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ధనుంజయ మజ్జి

రాజారావుకు అభినందన

ఆమదాలవలస: జన విజ్ఞానవేదిక జిల్లా శాఖ నిర్వహించిన కవితల పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన ప్రముఖ రచయిత, అభ్యుదయ కవి కుప్పిలి వెంకట రాజారావుకు ఆదివారం సత్కరించారు. ఆమదాలవలస జనవిజ్ఞాన వేదిక ప్రాంతీయ కమిటీ తరపున జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దన రావు, ప్రాంతీయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి ప్రకాశరావు, కూర్మాన షన్ముఖరావు, బెండి సూర్యనారాయణ, ఎ.రాజాలు రాజారావుకు అభినందించారు.

శ్రీకూర్మనాథుని సన్నిధిలో విశ్రాంత ఐఏఎస్ అధికారి



లక్ష్మీనరసింహం దంపతులను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

గార: శ్రీకూర్మనాథుని సన్నిదిలో విశ్రాంత ఐఏఎస్ అధికారి, జిల్లా పూర్వ కలెక్టర్ డాక్టర్ పి.లక్ష్మీనరసింహం దంపతులు ఆదివారం గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామి వారి ప్రసాదాన్ని చిత్రపటాన్ని ఈవో గురునాథరావు, ప్రధాన అర్చకులు సీతా రామ నరసింహాచార్యులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అనీల్‌కుమార్,వీఆర్వో జగదీష్, నర్సుబాబు పాల్గొన్నారు.

ఆదిత్యాలయంలో మహా లింగార్చన



మహాలింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు

అరసవల్లి: అరసవల్లి ఆదిత్యాలయం అనివెట్టి మండపంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆదివారం వేదపండితులు, అర్చకులు మహాలింగార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఇప్పిలి సాందీప శర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మ పాల్గొన్నారు. కాగా ఆదివారం ఒక్కరోజు స్వామివారికి రూ.3,27,675ల ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.80,800లు, విరాళాల ద్వారా రూ.1,12,040లు, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.1,35,835లు లభించాయని ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.

శ్రీకాకుళంలో తెరవే కవిసమ్మేళనం

శ్రీకాకుళంకల్చరల్:శ్రీకాకుళంలోతెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో(తెరవే) 91వ నెల, నెలవారీ సాహితీ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు.సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకట రమణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 12 మంది కవులు తమ రచనలను చదివి వినిపించారు. కార్యక్రమంలో కవులు ఐఎన్‌డీ ప్రసాద్, మంగిపూడి శ్రీనివాసరావు,ఇద్దిపావయ్య, తోట గోపాలరావు, నిక్కు అప్పన్న, యు.నాగేశ్వరరావు, ఆర్‌వీరమణమూర్తి, పూడి జనార్దనరావు పాల్గొన్నారు.

మిర్చి సాగుపై రైతుల ఆసక్తి

జి.సిగడాం: మండలంలోని రైతులు మిర్చిసాగుకు ఆసక్తి చూపుతున్నారు. నడిమివలస, గేదెలపేట, పెనసాం, శేతుభీమవరం తదితర గ్రామాల్లో సుమారు 50 ఎకరాల్లో80 నుంచి 100 మంది వరకు రైతులు మిరప పంటను సాగుచేస్తున్నారు. దిగుబడి ఆశాజనకంగా ఉండడంతోపాటు మార్కెటింగ్‌సదుపాయం ఉండడంతోఇక్కడి రైతులు సాగుకు ముందుకొస్తున్నారు. ఎకర మిరప సాగుకుఎరువులు, పురుగుమందులు, పంటను ఏరేందుకు వేతనాలు, పంటకు నీరు పెట్టేందుకు, దుక్కులకు 25 వేల రూపాయల వరకూ పెట్టు బడి అవుతుందని రైతులు చెపుతున్నారు.అప్పుడే ఏరిన పంట ఎకరానికి దిగుబడి పచ్చిమిర్చి 17 నుంచి 18 క్వింటాళ్లు, ఎండపెట్టిన ఎండిమిర్చి ఎకరాకు తొమ్మిది నుంచి 10 క్వింటాళ్లు దిగుబడివస్తుంది. అప్పుడే తీసిన మిరప కిలో రూ.45 ఉంటుంది. ఎండి మిర్చి కిలో రూ. 200 వరకు ఉంటుంది. పెట్టుబడి పోనుఎకరానికి 20 నుంచి 22 వేలు రూపాయల వరకూ ఆదాయం వస్తుందని రైతులు చెపుతున్నారు.